RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 362 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 4 జూలై 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# ఆగష్టు 15 నాటికి.. 'మాఫీ' అవ్వాల్సిందే!

## రైతు రుణమాఫీకి పైసలు రెడీ!

## ఖజానాలో ఉన్న మొత్తం ఎంతంటే..?

హైదరాబాద్ : తెలంగాణ బ్యూరో : రైతు రుణమాఫీకి కావాల్సిన నిధులను ప్రభుత్వం దాదాపుగా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ ఖజానాలో సుమారు రూ. 15 వేల కోట్ల నిధులు రిజర్వులో ఉన్నట్లు సమాచారం.

పంద్రాగస్టు నాటికి మరో రూ. 9 వేల కోట్లను సమీకరించేందుకు అరేంజ్‌మెంట్స్ చేస్తున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన మరుక్షణమే రైతుల అకౌంట్స్‌లో ఈ నిధులను జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అవసరమైతే ఈ నెలాఖరు నుంచే ప్రాసెస్ స్టార్ట్ చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ కోసం రూ. 31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం ముందుగా భావించింది. కానీ విధివిధానాలు తయారు చేసిన తర్వాత.. ఆ ఖర్చు కొంతమేరకు తగ్గే అవకాశమున్నట్టు అధికారులు భావిస్తున్నారు.

**అప్పును పొదుపు చేసి..** ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు రుణమాఫీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకున్నది.

దీని కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి సేకరించిన రుణాలను ఇతర ఖర్చుల కోసం ఉపయోగించకుండా, ఆ మొత్తాన్ని పక్కనపెట్టినట్టు తెలిసింది. ఒక్కపైసా ఖర్చు చేయకుండా, కేవలం రుణమాఫీ కోసం ఓ ప్లాన్ ప్రకారం వాటిని బ్యాంకుల్లో దాచినట్టు సమాచారం. ఎఫ్ఆర్బీఎం చట్టం ప్రకారం 2024-25ఆర్థిక సంవత్సరానికి మొదటి ఆరు నెలల కోసం ఆర్బీఐ రూ. 29 వేల కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

ఆ సొమ్ము మొత్తాన్ని రుణమాఫీ కోసమే వినియోగించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ప్రభుత్వవర్గాల్లో ప్రచారం ఉంది.

**భూములు అమ్మకుండానే..** రుణమాఫీ కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. కానీ కార్పొరేషన్ కింద తీసుకునే ప్రతి పైసా రుణం ఎఫ్ఆర్బీఎం పరిధి కిందనే ఆర్బీఐ జమ కట్టనుందని తేలింది. దీంతో కార్పొరేషన్ ఏర్పాటు వల్ల అదనపు ప్రయోజనం లేదని నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వం సర్కారు భూములను విక్రయించాలని భావించింది. అయితే భూముల విక్రయంతో రుణమాఫీకి కావాల్సిన నిధుల సమీకరణ కష్టమని నిపుణులు చెప్పడంతో ఆ ఆలోచనను విరమించుకున్నది. చివరికి ప్రభుత్వ భూములను తనఖా పెట్టి రుణాలను తీసుకోవాలనే ప్రతిపాదన సైతం తెరమీదికి వచ్చింది.

అలా చేస్తే ప్రభుత్వం పరువు పోతుందేమోననే అనుమానంతో ఆ ప్రతిపాదనను సైతం పక్కన పెట్టారు. చివరికి ఎఫ్ఆర్బీఎం చట్టం మేరకు రాష్ట్రం తీసుకునే అప్పుతోనే రుణమాఫీ చేసేందుకు సర్కారు సిద్ధమైందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**రూ. 29 వేల కోట్లు రెడీ! :** ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ. 13 వేల కోట్లను సేకరించింది. ఈ రెండుమూడు రోజుల్లో మరో రూ. 2 వేల కోట్ల రుణం తీసుకునేందుకు సిద్ధమైంది. దీంతో ప్రభుత్వ ఖజానాలో రూ. 15 వేల కోట్లు ఉండనున్నాయి. రెండో త్రైమాసకంలో మరో రూ. 14 వేల కోట్ల అప్పు చేసేందుకు ప్రభుత్వానికి వెసులు బాటు ఉంది. అందులో రూ. 9 వేల కోట్లను ఆగస్టు 15లోపు తీసుకునేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తున్నది.

దీంతో ప్రభుత్వం వద్ద రూ. 24 వేల కోట్ల మేరకు నిధులు ఉంటాయి. ఒకవేళ అవసరమైతే మిగతా రూ. 5 వేల కోట్ల రుణాన్ని కూడా ఆగస్టు 15 లోపే తీసుకొని రుణమాఫీ కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌కు కేటీఆర్ ఫోన్... కారణమిదే!

హైదరాబాద్, జూలై 3: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేశారు. ఏఈఈ సివిల్ ఉద్యోగుల నియామక భర్తీకి సంబంధించి సెలక్షన్ జాబితాను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా



కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను ఏఈఈ (సివిల్) రాసిన అభ్యర్థులు కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫై చేసిన 1180 పోస్టులకు పరీక్షలు జరిగాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిక జాబితాను పెండింగ్‌లో పెట్టిందన్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి అభ్యర్థులు తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. ఈ విషయానికి సంబంధించిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డితో మాట్లాడారు. సెలక్షన్ జాబితాను వెంటనే విడుదల చేయాల్సింది మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.



## కొత్త చట్టాలపై ఆందోళన ఎందుకు?

భారతదేశంలో జూలై 1 నుంచి కొత్తచట్టాలు అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా... ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీ.ఎన్.ఎన్).. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీ.ఎన్.ఎస్.ఎన్.).. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈ చట్టం) స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీ.ఎస్.ఏ) అమలవుతున్నాయి. అయితే ఈ కొత్తచట్టాలపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పైగా వారు లేవనెత్తే సందేహాలు, అంశాలు అత్యంత సహేతుకమైనవనే కామెంట్లు వినిపిస్తున్నాయని చెబుతున్నారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, న్యాయశాఖ మంత్రులూ ఈ విషయంలో కేంద్రానికి లేఖలు రాస్తున్న పరిస్థితి. అవును... దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే... జూన్ 30 వరకూ జరిగిన నేరాలకు సంబంధించి మాత్రం విచారణ, కోర్టులు పాత చట్టాల ప్రకారమే పనిచేస్తాయి. అంటే... ఏక కాలంలో రెండు రకాల చట్టాల ప్రకారం పని జరుగుతుందన్నమాట. ఈ సందర్భంగా కొత్త చట్టాలపై పలువురు నేతలు, న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు కర్ణాటక న్యాయ శాఖ మంత్రితో పాటు పలువురు న్యాయవాదులు ఈ కొత్తచట్టాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై సుదీర్ఘమైన చర్చ జరగాలని కోరుతున్నారు.

రాష్ట్రాల నుంచి ఇచ్చిన సలహాలను కేంద్రం ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదని చెబుతున్నారు. దీంతో వారు లేవనెత్తిన అంశాలపై ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తుంది. ఆ ఆందోళనలకు కారణమైన అంశాలేమిటనేది ఇప్పుడు చూద్దాం...!

**నిరాహార దీక్ష నేరం!:** కొత్త చట్టాలపై పలువురు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అందుకు గల కారణాలనూ వివరిస్తున్నారు.

ఇందులో భాగంగా... ఆత్మహత్యలను నేరంగా పరిగణించకుండా.. నిరాహార దీక్షను నేరంగా పరిగణించడం దురదృష్టం అని అంటున్నారు కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్.కే. పాటిల్! మహాత్మ గాంధీ నిరాహార దీక్ష చేసి సత్యాగ్రహం చేస్తేనే దేశానికి స్వాతంత్రం వచ్చిందని గుర్తు చేస్తున్నారు!

**చట్టాల్లో లింగ వివక్ష!:** దేశంలో అత్యాచారాలకు సంబంధించిన చట్టాలను లైంగిక వివక్ష లేకుండా రూపొందించాలనేది "లా కమిషన్" 2000వ సంవత్సరంలో చేసిన సిఫార్సు! ఇలా లా కమిషన్ నుంచి ఉన్న సిఫార్సును ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా... లైంగిక దోపిడీకి గురైన పురుషులకు సంబంధించి కొత్త చట్టంలో ఎలాంటి నిబంధనలూ లేవని కర్ణాటన నిపుణుల కమిటీ పేర్కొంది. తమ సూచనలు పరిగణలోకి తీసుకోలేదని అంటున్నారు!

**సైబర్ నేరాలు ఎక్కడ?:** ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు, హ్యాకింగ్ వంటివి ఏ స్థాయిలో పెట్రేగిపోతున్నాయనేది తెలిసిన విషయమే. ఈ డిజిటల్ యుగంలో వీటి సమస్య పెనుశాపంగా మారుతుంది. అయితే... ఈ సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఆర్థిక నేరాలు, పన్ను రహిత దేశాల్లో డబ్బులు దాచడం, డిజిటల్ నష్టం కలిగించడం వంటి నేరాలను కొత్తచట్టంలో చేర్చలేదని అంటున్నారు.

**పోలీసులకు మరిన్ని అధికారాలు!:** భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీ.ఎన్.ఎస్.ఎన్.)లో ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసి, ప్రాథమిక విచారణ జరిపేందుకు పోలీసులకు 14 రోజుల సమయం ఇచ్చారు. అయితే... లలిత కుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తర ప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు నిర్ణయానికి ఇది పూర్తిగా విరుద్ధం అని అంటున్నారు.

ఇదే సమయంలో కొత్త చట్టాల ప్రకారం... ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం హెడ్ కానిస్టేబుల్ కు ఇవ్వడంతో పాటు.. ఉగ్రవాదానికి పాల్పడినట్లు ఎవరిపై అయినా ఆరోపణలు చేయడం ఆందోళన కలిగించే అంశాలని మానవ హక్కుల కార్యకర్తలు అంటున్నారు. అదేవిధంగా... ఒక నిందితుడికి కానీ నేరస్థుడికి కానీ ఇ-మెయిల్ పంపడం, అతడితో కలిసి టీ తాగడానికి వెళ్లడం వంటి చిన్న చిన్న కారణాలతో కూడా ఈ కొత్త చట్టాల ప్రకారం కేసు పెట్టవచ్చు! ఇదే క్రమంలో... ఎవరినైనా అదుపులోకి తీసుకుని 90 రోజుల పాటు తమ కస్టడీలో ఉంచుకునే హక్కు పోలీసులకు ఉంటుంది!



# ఆ ఉలికిపాటు...ఏల..?

## ఇరువురు సీఎంల భేటీ...

## కేసీఆర్, కేటీఆర్ - జగన్‌కు టెన్షన్ ఎందుకు ?

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకప్పటి గురు శిష్యులు అయిన.. ఆంధ్రప్రదేశ్ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి.. త్వరలో భేటీ కానున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి భేటీపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు, రాజకీయ అభిరుచి ఉన్న ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. మరి ముఖ్యంగా విభజన సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఈనెల 6న సమావేశం అవుతుండడంతో.. తమకు కావాల్సినంత స్టఫ్ దొరుకుతుందని బీఆర్ఎస్ పార్టీ ఎంతో ఆశతో ఎదురుచూస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీతెలంగాణ రాష్ట్రంలో తీవ్రమైన కల్లోల పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. రేవంత్ రెడ్డి, చంద్రబాబు భేటీ అయితే దానిని చిలువలు, పలువులు చేసి మానసిక ఆనందం పొందాలని.. బీఆర్ఎస్ ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. జగన్, కేసీఆర్ ఎంత స్నేహంగా ఉన్నా.. గత ఐదేళ్లలో విభజన సమస్యల పరిష్కారం కోసం వీరిద్దరూ కలిసి ఒక్క అడుగు కూడా వేయలేదు.

అసలు ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడంతో.. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుంటున్నారు. దీనిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు మెచ్చుకోవాల్సింది పోయి.. రాజకీయపరమైన విమర్శలు చేసి లబ్ధి పొందాలని చూడటం అవివేకం అవుతుంది. ఈ ఇద్దరు ముఖ్యమంత్రి తర్వాత విభజన సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో కానీ.. ఈ సమావేశం ఇప్పుడు కెసిఆర్, కేటీఆర్, ఏపీ మాజీ సీఎం జగన్‌ను మాత్రం తెగ టెన్షన్ పెట్టేస్తోంది. ఏది ఏమైనా వీరిద్దరి బేట్టి తర్వాత ఏదో ఒక సెంటిమెంట్ పండించి రాజకీయంగా కాస్త లైవ్ లోకి రావాలని కేసీఆర్, కేటీఆర్ ప్లాన్ చేసుకున్నట్టు తెలుస్తోంది.

1మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా అయితే వీరిద్దరు భేటీ కోసం కాచుకుని కూర్చుంది. అయితే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం చేసే వారి తాటతీస్తానని వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మరి దీనిపై బిఆర్ఎస్ సోషల్ మీడియా ఏం చేస్తుందో చూడాలి.

